క్లుప్తంగా

రేపు ముక్కంటి హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో సాగర్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

మృతురాలి కుటుంబానికి చేయూత


నగదును అందజేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట పంచాయతీ పరిధి వెంకటాపురంలో మృతురాలి కుటుంబానికి సోమవారం వైఎస్సార్‌ సీపీ మండల ఇన్‌చార్జ్‌ గున్నేరి కిషోర్‌రెడ్డి నగదును అందించి చేయూతనిచ్చారు. వెంకటాపురం గ్రామానికి చెందిన శ్రీవరం మల్లెమ్మ(61) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు గున్నేరి కిషోర్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి భర్త శ్రీవరం నరసయ్యకు రూ.10 వేలు నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ నిర్మల వైఎస్సార్‌సీపీ నాయకుడు సునీల్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్‌ యువర్‌ డీఎం నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులు తమ సమస్యలను మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు ఫోన్‌ ద్వారా డిపో మేనేజరు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. 9959225673 నెంబరుకు ఫోన్‌ చేయాలన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం


సరుకులు, నగదు అందజేస్తున్న ముదిరాజ్‌ సంఘం సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కొండమిట్ట ప్రాంతానికి చెందిన గుమ్మడి హరికుమార్‌ ముదిరాజ్‌ ఇటీవల ప్రమాదవశాత్తు టపాకాయల పేలుడులో ఓ కన్ను కోల్పోయాడు. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తి ముదిరాజ్‌ సంఘం ఆధ్వర్యంలో రూ.20వేలు ఆర్థిక సాయం నిత్యావసర సరుకులు అందజేశారు. దీంతో హరికుమార్‌ కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వల్లమ కన్నయ్య, వైవీ రమణయ్య, రాజేంద్ర, చిన్న సుధాకర్‌, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు


తలారివెట్టు గ్రామంలోని ఆర్‌బీకేలో యూరియాను దించుతున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు తీసుకెళ్లవచ్చని ఏఓ భారతి తెలిపారు. సోమవారం మండలంలోని ఆర్‌బీకేలకు ఎరువుల స్టాక్‌ వచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలు సాగు చేసే రైతులకు అవసరమైన రసాయన ఎరువులు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వరి, వేరుశనగ, మినుము పంటలను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ క్రాప్‌ పంట నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందించే రాయితీలు రైతులకు అందుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ఆధార్‌, పొలం పాసుబుక్‌, బ్యాంకు పాసుబుక్‌ జిరాక్స్‌, ఫోన్‌ నంబరును అగ్రికల్చర్‌ అసిస్టెంట్‌లకు అందజేసి, ఈ క్రాప్‌ పంట నమోదు చేసుకోవాలన్నారు.

రేణిగుంట సంతగేటు మూసివేత

రేణిగుంట: రేణిగుంట సంతగేటును మరమ్మత్తుల నిమిత్తం బుధవారం ఉదయం 7గంటల నుంచి ఈనెల 13వ తేదీ సాయంత్రం 6గంటల వరకు మూసివేస్తున్నట్లు రైల్వే ఇంజనీరింగ్‌ అధికారులు సోమవారం వెల్లడించారు. ఆ మార్గం గుండా తూకివాకం, ఏఎస్‌ఆర్‌ కాలనీ, భగత్‌సింగ్‌ కాలనీ, రజక కాలనీ, వివేకానంద కాలనీ, సీబీఐడీ కాలనీలకు రాకపోకలను సాగించే వారు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని కోరారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం 6గంటల పైన సంత గేటు ద్వారా యథావిధిగా రాకపోకలను సాగించవచ్చన్నారు.




శ్రీకాళహస్తి: సమావేశంలో మాట్లాడుతున్న బియ్యపు పవిత్రారెడ్డి, మందులను అందజేస్తున్న పవిత్రారెడ్డి, బుచ్చినాయుడుకండ్రిగ: పల్లమాలలో వృద్ధురాలికి కళ్లజోడు అందజేస్తున్న దృశ్యం

ప్రజారోగ్యమే జగనన్న లక్ష్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన
- కళ్లద్దాలు, సురక్ష కార్డులను పంపిణీ చేస్తున్న వైద్యులు, ప్రజాప్రతినిధులు

శ్రీకాళహస్తి: ప్రజారోగ్యమే జగనన్న లక్ష్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి అన్నారు. మండలం ఇనగలూరు సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. నియోజకవర్గంలో గత 30 ఏళ్లుగా ఎమ్మెల్యేగా గెలిచిన వారెవరూ ప్రజలను పట్టించుకోలేదన్నారు. గెలిచిన వెంటనే హైదరాబాద్‌కు వెళ్లి ఎన్నికల ముందు వచ్చేవారన్నారు. వారికి భిన్నంగా తన తండ్రి బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తున్నారన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, సర్పంచ్‌ నాగరాజు, వెంకట్‌రెడ్డి, సీతారామయ్య, ఊట రమేష్‌ప్రసాద్‌, కలివెలయ్య, రాధాకృష్ణ, బాలకృష్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ వైద్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజలకు వారి ఇళ్ల వద్దే మెరుగైన వైద్యం అందించడానికి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని పల్లమాల గ్రామ సర్పంచ్‌ జొన్నల రమణమ్మ తెలిపారు. సోమవారం పల్లమాల గ్రామ సచివాలయ పరిధిలోని వైఎస్సార్‌ క్లినిక్‌ వద్ద జగనన్న ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె వృద్ధులకు కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచితంగా 7 రకాల పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 461 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు, గ్రామ కార్యదర్శి మునికృష్ణ, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

313 మందికి వైద్య పరీక్షలు

పిచ్చాటూరు: మండలంలోని వెంగళత్తూరులో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష వైద్య శిబిరంలో 313 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ హమీద్‌, డాక్టర్‌ పవిత్ర, గైనకాలజిస్ట్‌ విశ్వకళ్యాణి, జనరల్‌ సర్జన్‌ డాక్టర్‌ నరేంద్ర వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ అన్నాదురై, తహసీల్దారు మధుసూదన్‌ రావు, ఎంపీటీసీ సభ్యులు బేబి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్‌ కె.చంద్రశేఖర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం

నారాయణవనం: వైద్య సలహాలను సకాలంలో పొందలేని పేదల కోసమే వైఎస్సార్‌ కాంగ్రెస్‌ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఆ పార్టీ సీనియర్‌ నాయకులు సుదర్శనరెడ్డి అన్నారు. సోమవారం నారాయణవనం-2 సచివాలయ పరిధిలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యాన్ని గ్రామానికి, అవసరమైతే ఇంటి వద్దకే తెచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. సంక్షేమంతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్న జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన వైద్య శిబిరంలో 450 మంది పరీక్షలు చేసుకుని ఉచితంగా మందులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్‌ శాఖ ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార స్టాల్‌ అందరినీ ఆకట్టుకుంది. పై కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్‌ సొరకాయలు, ఎంపీటీసీ రాధ, ఎంపీడీవో కృష్ణమూర్తి, తహసీల్దార్‌ ప్రమీల, డాక్టర్లు దర్శిత్‌రాజ్‌, రాగసుధ, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు గురుస్వామి, చిన్నదొరై, మోహన్‌, సొరకాయలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


పిచ్చాటూరు: వెంగళత్తూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచ్‌ అన్నాదురై


శిబిరంలో మహిళలకు సూచనలు ఇస్తున్న వైద్య సిబ్బంది

13 వరకు తపాలా వారోత్సవాలు

తిరుపతి అర్బన్‌: జాతీయ తపాలా వారోత్సవాలను సోమవారం నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పోస్టల్‌ పార్శల్‌ విభాగం సూపరింటెండెంట్‌ హరికృష్ణప్రసాద్‌ తెలిపారు. తపాలాశాఖ ఔన్నత్యాన్ని ప్రజలకు తెలియజేయడంతోపాటు విప్లవాత్మక మార్పులను ప్రజల చెంతకు చేర్చడమే ఈ వారోత్సవాల ఉద్దేశమని వెల్లడించారు. ప్రధానంగా స్పీడ్‌, రిజిస్టర్‌, పార్శల్‌ పోస్టులు, సాధారణ ఉత్తరాలను నిర్ణీత సమయానికి చేరవేస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్లుగా టీటీడీ వెబ్‌సైట్‌లో బుక్‌ అయిన క్యాలెండర్లు, డైరీలను స్వామి వారి భక్తులకు సకాలంలో, సురక్షితంగా చేర్చుతున్నట్లు పేర్కొన్నారు.

రూ.12 లక్షల గ్రాంట్‌ మంజూరు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలోని టీవోసీఐసీ కేంద్రం, పీఆర్‌ఐఎస్‌ఎం పథకం కింద స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలలో ఆవిష్కరణలకు న్యూఢిల్లీలోని సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ సైంటిఫిక్‌ అండ్‌ ఇండస్ట్రియల్‌ రీసెర్చ్‌ రూ.12 లక్షల వార్షిక గ్రాంట్‌ను అందించింది. వీసీ భారతి టీఓసీఐసీ కేంద్రం కృషిని అభినందించారు. ప్రొఫెసర్‌ పి జోత్స్నకు గ్రాంట్‌ మంజూరు పత్రాలు అందజేశారు.

హత్యాయత్నం కేసులో మహిళకు ఏడాది జైలు

తిరుపతి లీగల్‌ : ఇనుప రాడ్డుతో వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నం చేసిన తిరుపతి ఎస్టీవీ నగర్‌ వెంకటరెడ్డికాలనీకి చెందిన గుత్త హంసవేణి అలియాస్‌ కవితకు ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు సీనియర్‌ సివిల్‌ జడ్జి సునితారాణి సోమవారం తీర్పు చెప్పారు. ఈస్టు సీఐ మహేశ్వర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్‌ అయ్యప్ప కథనం మేరకు.. ఎస్టీవీ నగర్‌కు చెందిన వీకె.రాము తన ఇంటి ముందున్న ఇంటిని హంసవేణికి విక్రయించాడు. అతని ఇంటి నుంచి ప్రధాన రోడ్డులోకి వెళ్లడానికి సందు దారి ఉండేది. ఇంటిని విక్రయించే సమయంలో అంగీకరించినట్టు ఆమె ఇంటిపై ఉండే సన్‌షేడ్‌ను తొలగించలేదు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషులు రాజీ కుదిర్చి సన్‌షేడ్‌ను తొలగించారు. దీనిపై ఆమె కక్ష పెంచుకుని ఆ సందులో డ్రైనేజీ నీటిని వదలడం, తదితర పనులు చేస్తూ రాము కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలిగించేవారు. ఈ నేపథ్యంలోనే 2020 ఆగస్టు 30వ తేదీ ఉదయం 4.20 గంటల సమయంలో రాము మార్కెట్‌కు బయలుదేరగా రాజరాజేశ్వరి ఆలయ సమీపంలో హంసవేణి ఇనుప రాడ్డుతో దాడి చేసి గాయపరిచింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈస్టు పోలీసులు కేసు నమోదు చేసి ఆమెను కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ తరపున ఏపీపీ చెవిరెడ్డి శ్రీదేవి వాదించారు.

సామాజిక తనిఖీల గ్రామసభలు


అంజిమేడులో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న డీఆర్పీ వెంకటేశ్వరరావు

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీల గ్రామ సభలు జరిగాయి. అంజిమేడు, పల్లం, మోదుగుల పాలెం, పంగూరు, కోబాక చింతలపాలెం, సరస్వతి కండ్రిగ, బండారుపల్లి తదితర గ్రామాల్లో ఈ నెల 4 నుంచి సామాజిక తనిఖీలు కొనసాగుతున్నాయి. పనుల్లో జరిగిన అవినీతిని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, కూలీల సమక్షంలో డీఆర్పీలు చదివి వినిపించారు. త్వరలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగే బహిరంగ సభలో అవినీతిని వెల్లడించనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోవిందయ్య, కూలీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్‌ పోటీలకు ఎంపిక


విద్యార్థితో ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని పెద్దకనపర్తి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి లోకేష్‌ త్రోబాల్‌ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం సోమవారం చెప్పారు. చిత్తూరు జిల్లా, కుప్పంలో సోమవారం రాష్ట్ర స్థాయి త్రోబాల్‌ పోటీలు జరిగినట్లు చెప్పారు. ఈ పోటీల్లో ఎంపికైన లోకేష్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత న్యాయంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి: న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా పట్టణంలోని శివం కల్యాణ మండపం వద్ద న్యాయవాదులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉచిత న్యాయం గురించి, హక్కులు విధులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, అరుణ్‌, పారా లీగల్‌ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలు

తిరుపతి లీగల్‌: రెండో వివాహం చేసుకుని మొదటి భార్యను మానసికంగా వేధించిన కేసులో తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన ఎస్‌.ధనుంజయరెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి గ్రంథి శ్రీనివాస్‌ సోమవారం తీర్పు చెప్పారు. దిశ స్టేషన్‌ కోర్టు కానిస్టేబుల్‌ సురేంద్ర కథనం మేరకు.. ధనుంజయరెడ్డి వడమాలపేట మండలం కాలూరుకు చెందిన ఎస్‌.పుష్పవతిని 1997లో వివాహం చేసుకున్నాడు. వారికి ఒక పాప కలిగింది. ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన సొమ్ముతో ధనుంజయరెడ్డి తిరుపతి తిలక్‌రోడ్డు, జగన్నాథపురంలోని ఓ ఇంటిని కొన్నాడు. మొదటి అంతస్తుల్లో షేర్‌ బ్రోకర్‌ వ్యాపారాన్ని ప్రారంభించాడు. తర్వాత వ్యాపారాన్ని గ్రౌండ్‌ ఫ్లోర్‌కు మార్చి తన సొంత గ్రామమైన ఆర్సీపురం మండలం నడవలూరులో కాపురం పెట్టాడు. షేర్‌ బ్రోకర్‌ ఆఫీసులో పనిచేస్తున్న పి.గౌరీ జ్యోతి అనే మహిళను రెండో వివాహం చేసుకుని తిరుపతి జగన్నాథపురంలోని ఇంట్లోనే కాపురం పెట్టాడు. వారికి ఒక బాబు కలిగాడు. ఈ విషయం తెలుసుకున్న మొదటి భార్య దిశ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ సంజీవ కుమార్‌ కేసు దర్యాప్తు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నేరం ధనుంజయరెడ్డిపై మాత్రం రుజువు కావడంతో అతనికి శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. గౌరీజ్యోతిపై కేసును కొట్టి వేశారు.

హోరాహోరీగా త్రోబాల్‌ పోటీలు

నగరి : మున్సిపల్‌ పరిధిలోని ఏకాంబరకుప్పం జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాలలో 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఉమ్మడి జిల్లాస్థాయి త్రోబాల్‌ ఎంపిక పోటీలు నిర్వహించారు. 450 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా ఎంఈఓలు ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం ఆధ్వర్యంలో బాలుర, బాలికల విభాగాల్లో పలు ఎంపిక పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ప్రతిభ ఆధారంగా న్యాయ నిర్ణేతలు బాలికల విభాగంలో 14 మందిని, బాలుర విభాగంలో 14 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ కార్యదర్శి వి.సురేష్‌, విజయకుమారి, బాబు తెలిపారు. వీరికి ఏకాంబరకుప్పం జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాలలో 5 రోజుల పాటు రెసిడెన్షియల్‌ కోచింగ్‌ క్యాంప్‌ ఉంటుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం నమశ్శివాయం మాట్లాడుతూ క్రీడలతో మానసిక వికాసం కలుగుతుందని ఇందరు విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ చూపడం శుభపరిణామం అంటూ విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల కార్యదర్శులు సుబ్రమణ్యం రెడ్డి, నూరుద్దీన్‌, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



త్రోబాల్‌ ఆడుతున్న విద్యార్థులు, రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓలు, వ్యాయామ ఉపాధ్యాయులు

రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దారు చంద్రబాబు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో త్వరలో చేపట్టనున్న భూముల రీ సర్వేతో భూసమస్యల పరిష్కారం అవుతాయని, ఇందుకోసం భూములకు సంబంధించిన రికార్డులను పక్కాగా సిద్ధం చేసినట్లు డిప్యూటీ తహసీల్దారు చంద్రబాబునాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని నీర్పాకోట గ్రామంలో భూముల రీసర్వేపై గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూవివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్‌ఆర్‌ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భూముల రీసర్వే రైతులకు ఓ వరమని, రైతులంతా భూముల రీసర్వేకు సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రవ్యాప్తంగా 100 ఏళ్ల తర్వాత గ్రామీణ, పట్టణ, ప్రాంతాల్లో వ్యవసాయ, గ్రామ కంఠం స్థిరాస్తుల సర్వే జరుగుతుందన్నారు. భూముల రీసర్వేలో అన్‌ రిజిష్టర్‌, వంశపారంపర్యం భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తామన్నారు. సాగులో ఉన్నవారి పేరిట భూమి పాసుపుస్తకాలు వస్తాయని, ఆన్‌లైన్‌లో వారి పేరు నమోదు అవుతుందన్నారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు. నీర్పాకోట గ్రామ రెవెన్యూలో 1673 ఎకరాల భూమి ఉందని, త్వరలోనే భూముల సర్వే ప్రారంభం అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ జగదీష్‌, సర్వేయర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాణిజ్య సరళి సాగుతో రైతుకు ఆదాయం


సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీరెడ్డి

ఏర్పేడు: వ్యవసాయాన్ని వాణిజ్య సరళిలో సాగు చేస్తేనే ఖర్చు తగ్గి రైతు ఆశించిన ఆదాయం వస్తుందని రాస్‌ మహిళా ప్రగతి ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ బాలాజీరెడ్డి అన్నారు. మండలంలోని పాపానాయుడుపేట రాస్‌ మహిళా ప్రాజెక్ట్‌ కార్యాలయంలో సోమవారం రైతు రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాస్‌ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు సంక్షేమం కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 78 మంది రైతులకు సాగు కోసం రూ.52.40 లక్షల రుణాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాంకుమార్‌, వెంకట్‌కుమార్‌, మునిపార్థసారథి, రైతులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల నిరసన


నిరసన తెలుపుతున్న ఎండీయూ ఆపరేటర్లు


తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న వాహనాలు

నారాయణవనం: సర్వర్లు పనిచేయకపోవడంతో సకాలంలో ఇంటింటా నిత్యావసర వస్తువుల పంపిణీ చేయలేకపోతున్నామని మండలంలోని ఎండీయూ ఆపరేటర్లు తెలిపారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఏడుగురు ఆపరేటర్లు వాహనాలను నిలిపివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుంచి సర్వర్‌ పనిచేయకపోవడంతో పీఓఎస్‌ మిషన్లు పని చేయలేదన్నారు. దీంతో కార్డుదారులకు బియ్యం, చక్కెర అందించలేకపోతున్నామని తెలిపారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. మండలంలో 20 శాతం కార్డుదారులకు కూడా సరుకుల పంపిణీ జరగలేదన్నారు. ఈ మేరకు వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్‌ ప్రమీల మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సర్వర్‌ సమస్యను ఐటీ విభాగం పరిష్కరించాల్సి ఉందని, వారి దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

మొరాయిస్తున్న సర్వర్‌

ఏర్పేడు: ప్రజాపంపిణీ వ్యవస్థ సర్వర్‌ సక్రమంగా పనిచేయడంలేదని వాహనదారులు సోమవారం తహసీల్దారు శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతి రోజూసర్వర్‌ పనిచేయకపోవడంతో లబ్ధిదారులకు రేషన్‌ బియ్యం సక్రమంగా పంపిణీ చేయలేకపోతున్నట్లు వాపోయారు. తహసీల్దారు కార్యాలయం వద్ద వాహనాలు నిలిపి తహసీల్దారుకు వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించిన తహసీల్దారు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.